


APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ : నరేంద్ర

గుంటూరు | సంపుటి : 1 | సంచిక : 55 | పేజీలు : 8 | ఆదివారం 22 ఫిబ్రవరి 2026 | వెల : 4/-



# స్వచ్ఛతే.. రాష్ట్ర పునర్నిర్మాణం

- చెత్త రాజకీయాలపై ప్రజలే తీర్పు చెప్పాలిలిలి
- స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్రతో అభివృద్ధి దిశగా అడుగులు
- పల్నాడులో సీఎం చంద్రబాబు రాజకీయ సందేశం



పరిశుభ్రతతోనే అభివృద్ధి సాధ్యమని, స్వచ్ఛత ఒక కార్యక్రమం కాదు -- జీవన విధానమని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, గత పాలకుల నిర్లక్ష్యంతో రాష్ట్రం చెత్త గుట్టలుగా మారిందని విమర్శించారు. చెత్త నిర్వహణ నుంచి సంక్షేమం, టెక్నాలజీ నుంచి రాజకీయ ప్రక్షాళన వరకూ సమగ్ర దృష్టితో ముందుకెళ్తున్నామని ప్రకటించారు. చెత్త రాజకీయాలు, రౌడీ రాజకీయాలకు కాలం చెల్లిందని, అభివృద్ధి--సంక్షేమమే ప్రజల ముందున్న ఏకైక అజెండా అని ఆయన స్పష్టంగా చెప్పారు.

రక్షణ న్యూస్ అమరావతి బ్యూరో

వినుకొండ వేదికగా జరిగిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర సభ రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది. ఇది కేవలం పారిశుద్ధ్య కార్యక్రమం కాదు... ఇది గత పాలన వైఫల్యాలపై బహిరంగ విమర్శ, కొత్త పాలన దిశపై స్పష్టమైన ప్రకటన. చెత్త గుట్టలుగా పేరుకుపోయిన 108 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని సీఎం వ్యాఖ్యానించారు. భూమి, భూగర్భ - మిగతా2లో







## దైవద్రోహ రాజకీయాల పరాకాష్ఠ

తిరుమల పవిత్రతను వ్యవస్థాగతంగా ధ్వంసం చేసిన జగన్

లడ్డూలు, తలనీలాలు, దర్శన టిక్కెట్లు... దోపిడీ కేంద్రంగా మారిన టీటీడీ

హిందూ దేవాలయాలపై వరుస దాడులకు మౌన సమ్మతి ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం

దైవత్వ పరిరక్షణే తెలుగుదేశం పార్టీ లక్ష్యం -- స్పష్టం

వైసీపీ పార్టీపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే నరేంద్ర



దేవుడిని కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్న వైసీపీ పాలన దైవద్రోహానికి నిదర్శనమని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తీవ్రంగా విమర్శించారు. బాపట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను ఉద్దేశపూర్వకంగా దెబ్బతీశారని ఆరోపించారు. ఇది పాలనా వైఫల్యం కాదని, హిందూ ధర్మంపై వ్యవస్థాగత దాడి అని మండిపడ్డారు.



## సుబ్రహ్మణ్యం హత్య కేసులో సంచలన మలుపు

అనంత బాబుకు అండగా నిలిచిన పోలీసులపై వేటు

డీఎస్పీలు, ఎస్సై సస్పెండ్ --

ఢిల్లీలో తలదాచుకున్న ప్రధాన నిందితుడు?

కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎమ్మెల్సీ అనంత బాబుకు అప్పట్లో సానుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలపై పలువురు పోలీసు అధికారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యల నేపథ్యంలో సస్పెన్షన్లు, విచారణలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

## శుభవార్త చెప్పిన అచ్చన్న...

మత్స్యకారుల కుటుంబాలకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల

2018 నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం

మంత్రి అచ్చెన్నాయుడు

మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను విడుదల చేసినట్లు వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. మొత్తం రూ.4.75 కోట్లను 95 కుటుంబాలకు మంజూరు చేసినట్లు తెలిపారు.





## రేపటి నుండి ఇంటర్ పరీక్షలు

ఫీజు బకాయిలు ఉన్నా హాల్‌టికెట్ అడ్డుకోరు

## ఇదే కదా ఆదర్శం

శ్రీ పవన్ కళ్యాణ్ చొరవతో కొణిదెలకు మహర్దశ

రూ.50 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం

తీరనున్న గ్రామ దాహార్తి -- 2 వేల మందికి రక్షిత తాగునీరు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామానికి అభివృద్ధి బాట పట్టింది. రూ.50 లక్షల విరాళంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తికావడంతో పాటు, పలు పథకాల ద్వారా రూ.6 కోట్లతో గ్రామం సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతోంది.



## ఐటీ నుంచి ఏఐ వరకూ చంద్రబాబు దృష్టి



- నాడు ఐటీకి శ్రీకారం... నేడు క్వాంటం వ్యాలీకి పునాది
- విశాఖ గ్లోబల్ ఏఐ హబ్‌గా మారుతుందన్న సుందర్ పిచాయ్ ప్రశంసలు
- ఏఐ-క్వాంటం రంగంలో 7 కీలక ఒప్పందాలు
- భవిష్యత్ తరాలకు బంగారు బాట -- పల్లా శ్రీనివాసరావు

## మద్యం కుంభకోణం: వాసుదేవరెడ్డికి 27 వరకు రిమాండ్

రక్షణ న్యూస్ విజయవాడ



మద్యం కుంభకోణం కేసులో నిందితుడు వాసుదేవ రెడ్డిని సెట్ అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి భాస్కరరావు ఈ నెల 27 వరకు రిమాండ్ విధించారు. ఈ నెల 9న మద్యం కొనుగోళ్లకు సంబంధించి విచారణకు హాజరుకావాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. అనుగుణంగా శనివారం సెట్ అధికారుల ఎదుట హాజరైన వాసుదేవరెడ్డి, పలు కీలక ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకపోవడంతో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కోర్టుకు తరలించారు. రిమాండ్ విధించడంతో ఆయనను గుంటూరు జైలుకు తరలించారు.

# దైవద్రోహ రాజకీయాల పరాకాష్ఠ...

**బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో**

బాపట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం రాజకీయంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ సమావేశంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు వైసీపీ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేవదేవుడైన శ్రీ వెంకటేశ్వరస్వామినీ రాజకీయ అవసరాలకు వాడుకున్న వైసీపీ పాలనను ఆయన "దైవద్రోహ పాలన"గా అభివర్ణించారు.

జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నేతలకు దేవుడంటే భక్తి లేదని, భయం లేదని, హిందువుల మనోభావాలంటే లెక్కలేదని ఎమ్మెల్యే తీవ్రంగా ఆరోపించారు. జగన్ డైరెక్షన్‌లోనే శ్రీవారి ఫొటోలను చెప్పులు, షూలు వేసుకుని శాసనసభలోకి తీసుకువెళ్లి నినాదాలు చేయడం ద్వారా కోట్లాది హిందూ భక్తుల విశ్వాసాలను తొక్కేశారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను బూతులు, వెకిలి ప్రవర్తనల కేంద్రాలుగా మార్చారని, ఇప్పుడు దేవుడి ఫొటోలతోనూ రాజకీయాలు చేయడం వైసీపీ నీచత్వానికి పరాకాష్ఠ అని వ్యాఖ్యానించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయాలు, సంస్కృతి పట్ల జగన్ రెడ్డికి మొదటి నుంచీ చిన్న చూపే ఉందని నరేంద్ర వర్మ రాజు ఆరోపించారు. పరమ పవిత్రమైన శ్రీవారి ప్రసాదాన్ని జంతు కొవ్వు, ప్రమాదకర రసాయనాలతో కల్తీ చేయడం ద్వారా కోట్లాది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారని అన్నారు. ఇది కేవలం అవినీతి కాదని, దైవద్రోహానికి సమానమని స్పష్టం చేశారు.

శ్రీవారి పరకామణిలో విదేశీ కరెన్సీ దోపిడీ కేసులో నిందితుడితో రాజీ చేసుకుని అతని ఆస్తులను టీటీడీ పేరిట రాయించి దొంగలకు పెద్దన్నలా జగన్ వ్యవహరించారని ఎమ్మెల్యే ఆరోపించారు. తిరుమల లాంటి పవిత్ర ప్రదేశంలో "జగన్ రెడ్డి రక్షక గోవింద" అంటూ పొగిడించుకోవడం ద్వారా స్వామివారిని అవమానించారని, ఇది కోట్లాది హిందువుల గుండెల్లో గాయం చేసిన ఘటన అని అన్నారు.

శ్రీవారు నడయాడు ప్రదేశమైన మాడవీధుల్లో చెప్పులతో తిరిగి, తనకు స్వామివారి పట్ల ఎంత నిర్లక్ష్యం ఉందో జగన్ బహిరంగంగా చాటుకున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో టీటీడీ ఆస్తులను రాజకీయ అవసరాలకు వాడుకుని, లక్షల లడ్డూలను ఎన్నికల ప్రచారంలో కరపత్రాల్లా పంచారని ఆరోపించారు. టీటీడీ నిధులను దారి మళ్లించి తిరుపతి నగరపాలక సంస్థ పేరిట కోట్ల రూపాయలు దోచుకున్నారని మండిపడ్డారు.

వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు కలిసి వీఐపీ బ్రేక్ దర్శనాలు, సేవా టిక్కెట్లు అమ్ముకుని కోట్లు దండుకున్నారని, దర్శనం, వసతి, టోల్, ప్రసాదాల ధరలు పెంచి భక్తులను దోచుకోవడం వైసీపీ పాలనలో సాధారణమైందన్నారు. వెంకన్నకు అర్పించే తలనీలాలు కూడా వైసీపీ దోపిడీకి అతీతం కాలేదని, రూ.2 కోట్ల విలువైన తలనీలాలను అక్రమంగా మయన్మార్--థాయ్‌లాండ్ మార్గంలో చైనాకు తరలిస్తుండగా పట్టుబడిన ఘటన దీనికి నిదర్శనమన్నారు.

రామతీర్థంలో రాములవారి శిరస్సు ఖండన వంటి దాష్టీకాలు, రాష్ట్రవ్యాప్తంగా వందలాది దేవాలయాలపై దాడులు జగన్ పాలనలోనే జరిగాయని నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు. ఐదేళ్ల కాలంలో 300కు పైగా దేవాలయాలపై దాడులు జరిగినా, ఒక్కరోజు కూడా ముఖ్యమంత్రిగా జగన్ అక్కడికి వెళ్లి పరిశీలించలేదని తీవ్రంగా విమర్శించారు. ఈ ఘటనలను ఖండించడంలో కూడా జగన్ విఫలమయ్యాడని అన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సంప్రదాయబద్ధంగా సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించాల్సిన జగన్, ఆ సంప్రదాయాన్ని కూడా కాలరాశారని మండిపడ్డారు. అన్యమతస్థుడై ఉండి, ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండా తిరుమల పర్యటనలు చేయడం, స్వామివారికి తానే ఒక్కడే పట్టువస్త్రాలు సమర్పించడం హిందూ సంప్రదాయాలకు విరుద్ధమని పండితులు, మేధావులు అభ్యంతరం తెలిపినా జగన్ ఖాతరు చేయలేదని ఆరోపించారు.

దేవాలయాల భూముల అమ్మకాలపై, మాన్సాస్ ట్రస్ట్ ఆస్తులపై, టీటీడీ ఆస్తుల విక్రయంపై ఉన్న శ్రద్ధ... దేవాలయాల పరిరక్షణపై జగన్‌కు లేదని విమర్శించారు. తిరుమల శ్రీవారిని "నల్లరాయి" అన్న వ్యక్తికి టీటీడీ ఛైర్మన్ పదవి కట్టబెట్టడం వైసీపీ పాలన యొక్క అసలు ముఖచిత్రమని ఘాటుగా వ్యాఖ్యానించారు.

దేవదేవుడితో ఆటలు ఆడినందుకే జగన్ రాజకీయంగా 11 సీట్లకే పరిమితమయ్యాడని, అయినా సిగ్గు, బుద్ధి రాలేదని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చేసిన తప్పులు ఒప్పుకుని దేవుడిని క్షమాపణ వేడుకుంటేనే జగన్‌కు రాజకీయ భవిష్యత్తు ఉంటుందని హెచ్చరించారు. దైవత్వాన్ని, హిందూ ధర్మాన్ని కాపాడటమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో బాపుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జనసేన సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, బీజేపీ నాయకులు బాలు నారాయణ, తాతా జయప్రకాశ్ నారాయణ (రాష్ట్ర కార్యదర్శి), బాపట్ల మండలం టీడీపీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడు ఏపూరి భూపతి రావు, ఫరీద్ మస్తాన్, మందపాటి ఆంద్రేయ, గోపి, జాన్సీ రాణితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐటీ నుంచి ఏఐ వరకూ చంద్రబాబు దృష్టి

**అమరావతి, రక్షణ బ్యూరో**

కాలాన్ని ముందే అంచనా వేసి, భవిష్యత్తును వర్తమానంగా మలిచే నాయకత్వం అరుదుగా లభిస్తుందని, అలాంటి దార్శనిక నాయకుడే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. నాడు దేశానికి ఐటీ దిశను చూపిన నాయకుడు, నేడు ప్రపంచాన్ని క్వాంటం--ఏఐ యుగం వైపు నడిపించే దిశానిర్దేశకుడిగా చంద్రబాబు నిలిచారని ఆయన ప్రశంసించారు. వ్యవసాయ విప్లవం నుంచి పారిశ్రామిక విప్లవం, అక్కడి నుంచి ఐటీ యుగం వరకు ప్రతి కీలక దశలో మార్పును ముందే పసిగట్టినవారే చరిత్ర సృష్టించారని పల్లా గుర్తు చేశారు. 1998లో హైటెక్ సిటీకి శ్రీకారం చుట్టినప్పుడు వ్యక్తమైన అనుమానాలను పటాపంచలు చేస్తూ, ఒక తరం మొత్తాన్ని ఐటీ ప్రపంచంలోకి నడిపించిన నాయకత్వం చంద్రబాబుదేనన్నారు. అదే దూరదృష్టి నేడు అమరావతి క్వాంటం వ్యాలీ రూపంలో మరోసారి ఆవిష్కృతమైందని తెలిపారు. అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా తీర్చిదిద్దాలన్న నిర్ణయం సాధారణ పరిపాలనా చర్య కాదని, అది రాబోయే శతాబ్దపు సాంకేతిక యుగానికి పునాది వేసే చరిత్రాత్మక వ్యూహమని పల్లా అభివర్ణించారు. అమెరికా--చైనా మధ్య జరుగుతున్న క్వాంటం పోటీలో భారత్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాలన్న సంకల్పంతో చంద్రబాబు తీసుకున్న ధైర్యవంతమైన నిర్ణయం ఇది అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్‌కు అనుసంధానంగా, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిబద్ధత, మంత్రి నారా లోకేష్ ఆధునిక వ్యూహాలతో కలిసి రాష్ట్రాన్ని భవిష్యత్ టెక్నాలజీ కేంద్రంగా మార్చేందుకు చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో గ్లోబల్ దిగ్గజాలతో చర్చలు జరిపి, అంతర్జాతీయ పెట్టుబడులను రాష్ట్రానికి తేవడంలో చంద్రబాబు రాజకీయ చాతుర్యం, విశ్వసనీయత కీలక పాత్ర పోషించిందన్నారు. ఫిబ్రవరి 7న ఉద్దండరాయునిపాలెంలో అమరావతి క్వాంటం వ్యాలీ నిర్మాణానికి శంకుస్థాపన జరగడం కేవలం ఒక కార్యక్రమం కాదని, అది భవిష్యత్ తరాలకు ఇచ్చిన హామీ అని పల్లా వ్యాఖ్యానించారు. భారతదేశంలో తొలి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌కు వేదికగా నిలవనున్న ఈ ప్రాజెక్ట్ చంద్రబాబు దార్శనికతకు ప్రతీక అని కొనియాడారు. ఆగస్టు నాటికి నిర్మాణం పూర్తి చేసి, డిసెంబర్‌లో కార్యరూపంలోకి తీసుకురావాలన్న లక్ష్యం ఆయన పనితీరు వేగానికి నిదర్శనమన్నారు.

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్--2026లో ముఖ్యమంత్రి పాల్గొని కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వంపై ప్రపంచ వేదికలో మాట్లాడడం రాష్ట్ర ప్రతిష్ఠను మరింత పెంచిందన్నారు. "సావరిన్ ఏఐ" వినియోగం ద్వారా ప్రతి పౌరుడికి ప్రయోజనం చేకూర్చాలన్న చంద్రబాబు సంకల్పం ఆయన ప్రజాకేంద్రీకృత దృష్టిని ప్రతిబింబిస్తోందన్నారు.

విశాఖపట్నం గ్లోబల్ ఏఐ హబ్‌గా మారుతుందని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చేసిన వ్యాఖ్యలు ముఖ్యమంత్రి దూరదృష్టికి ప్రపంచ స్థాయి కితాబని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రశాంత నగరంగా గుర్తింపు పొందిన విశాఖ, నేడు గిగావాట్ స్థాయి కంప్యూటింగ్ సదుపాయాలతో, అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వేతో ఫుల్ స్టాక్ ఏఐ హబ్‌గా మారుతుందని ఆయన వ్యాఖ్యానించడమే ఆంధ్రప్రదేశ్ ఎదుగుదలకు నిదర్శనమన్నారు. గూగుల్ \$15 బిలియన్ పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న కేంద్రం వేలాది ఉద్యోగాలను సృష్టించనుందని తెలిపారు. ఏఐ--క్వాంటం రంగంలో 7 కీలక ఒప్పందాలు కుదరడం చంద్రబాబు నాయకత్వానికి మరో మైలురాయిగా నిలిచిందన్నారు. యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్‌తో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఐబీఎంతో లక్ష మంది యువతకు శిక్షణ, క్వాంటం యూనివర్సిటీ ఏర్పాటు, రాష్ట్ర స్థాయి ఏఐ టెక్ హబ్, ఉన్నత విద్యా సంస్థల్లో ఏఐ శాండ్‌బాక్స్, అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఐఐటీ మద్రాస్‌తో ఏఐ ట్యూటర్ వంటి ఒప్పందాలు రాష్ట్ర భవిష్యత్తును మలిచే నిర్ణయాలుగా పల్లా అభివర్ణించారు.

ఇప్పటికే వేలాది మంది విద్యార్థులు క్వాంటం శిక్షణలో పాల్గొనడం యువతలో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. "బ్రెయిన్ డ్రెయిన్"ను "బ్రెయిన్ గెయిన్"గా మార్చాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న నాయకుడు చంద్రబాబు మాత్రమేనని పల్లా స్పష్టం చేశారు. నాడు ఐటీతో రాష్ట్ర తలరాత మార్చిన నాయకుడు, నేడు క్వాంటం--ఏఐతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచానికి దిక్సూచిగా నిలబెట్టబోతున్నారని ఆయన ఘనంగా కొనియాడారు.

## సుబ్రహ్మణ్యం హత్య కేసులో సంచలన మలుపు

**రక్షణ న్యూస్ డెస్క్**

కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో న్యాయపరమైన చర్యలు వేగం పుంజుకున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎమ్మెల్సీ అనంత బాబుకు అప్పట్లో సానుకూలంగా వ్యవహరించి, విచారణను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారన్న ఆరోపణలపై పోలీసు అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు చేసిన ఘాటు వ్యాఖ్యల నేపథ్యంలో అధికార యంత్రాంగం స్పందించినట్లు తెలుస్తోంది. శనివారం రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి విశ్వజిత్ కీలక ఉత్తర్వులు జారీ చేస్తూ డీఎస్పీలు భీమారావు, మురళీకృష్ణారెడ్డి, సీఐ ఆకుల మురళీకృష్ణ అలాగే ఎస్సై సత్యబాబును సస్పెండ్ చేశారు. ఈ కేసులో తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించకుండా నిందితుడికి మద్దతుగా వ్యవహరించారన్న ఆరోపణల నేపథ్యంలో వీరిపై విభాగీయ విచారణ నిర్వహించాలని ఆదేశించారు. దర్యాప్తులో చోటుచేసుకున్న లోపాలు, అధికారుల పాత్రపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా, ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎమ్మెల్సీ అనంత బాబు ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు ఈ కేసును నవంబర్ 30లోపు పూర్తిగా విచారించి, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో ఆయన ఢిల్లీలో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. ఈ హత్య కేసులో అనంత బాబు భార్యపై కూడా ఆరోపణలు ఉండటంతో, ఆమె హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసి పరారీలో ఉన్నట్లు సమాచారం. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

## ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్ కొత్త ఫీచర్ ప్రకటన.. సైబర్ సెక్యూరిటీ షేర్లు ధమాల్..!

అగ్రరాజ్యం అమెరికాకు చెందిన ఏఐ స్టార్టప్ సంస్థ ఆంత్రోపిక్ వరుస సంచలనాలు సృష్టిస్తోంది. కొద్దిసేపటి క్రితం ఆ సంస్థ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన పోస్ట్‌తో సైబర్ సెక్యూరిటీ షేర్లు కుప్పకూలాయి. అమెరికా మార్కెట్‌లో ఆయా కంపెనీల స్టాక్స్ భారీగా పతనమయ్యాయి. సైబర్ సెక్యూరిటీ కోసం ఆంత్రోపిక్ కొత్త ఫీచర్ 'క్లాడ్ కోడ్ సెక్యూరిటీ'ని ప్రకటించింది. ఈ క్లాడ్‌కోడ్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ కోడ్‌బేస్‌లను స్కాన్ చేస్తుంది. అందులోని లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు పరిష్కారాలను సిఫార్సు చేస్తుంది. దాంతో కోడింగ్ ప్రాసెస్‌లోనే దెవలపర్లు భద్రతాపరమైన లోపాలను గుర్తించి, పరిష్కరించుకోవడానికి వీలు కలుగుతుంది. సంప్రదాయ పద్ధతుల్లో గుర్తించని లోపాలను కనుగొనేందుకు ఈ టూల్ ఉపయోగపడుతుందని ఆంత్రోపిక్ వెల్లడించింది. ఈ ఏఐ ఆధారిత ఫీచర్ ప్రస్తుతం పరిశీలన దశలో ఉంది. ఆంత్రోపిక్ పోస్టుతో సైబర్ సెక్యూరిటీ సంస్థల షేర్లు 5 శాతం నుంచి 9 శాతం మేర పతనమయ్యాయి. సైబర్‌సెక్యూరిటీతో సంబంధం ఉన్న సాఫ్ట్‌వేర్ సంస్థలైన గిట్‌ల్యాబ్, జెఫ్రాగ్ షేర్లు కూడా పడిపోయాయి. గ్లోబల్ ఎక్స్ సైబర్ సెక్యూరిటీ ఈటీఎఫ్ 5 శాతం పతనమైంది. మొత్తంగా మదుపర్ల సంపద 10 బిలియన్ డాలర్ల మేర ఆవిరైందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

## రేపటి నుండి ఇంటర్ పరీక్షలు

**రక్షణ న్యూస్ అమరావతి**

ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్ బోర్డు కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. ఫీజు బకాయిలు ఉన్న కారణంగా ఏ విద్యార్థి హాల్ టికెట్‌ను నిలిపివేయబోమని బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలకు హాజరుకావచ్చని పేర్కొంది. ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు బోర్డు అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్ సేవల ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ విధంగా పొందిన హాల్ టికెట్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేదా కళాశాల స్టాంప్ అవసరం లేదని స్పష్టంచేశారు. డౌన్‌లోడ్ చేసిన హాల్ టికెట్‌తోనే నేరుగా పరీక్ష కేంద్రాలకు వెళ్లి పరీక్షలు రాయొచ్చని పేర్కొన్నారు. వెబ్‌సైట్ లేదా వాట్సాప్ ద్వారా హాల్ టికెట్ పొందిన విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలు, పరీక్షల తేదీలు, సబ్జెక్టుల వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని బోర్డు మార్గదర్శకాల్లో పేర్కొంది. హాల్ టికెట్‌పై పేర్కొన్న పరీక్ష కేంద్రాన్ని ముందుగానే స్వయంగా వెళ్లి పరిశీలించుకోవాలని విద్యార్థులకు సూచించారు. తద్వారా పరీక్షల రోజుల్లో ఇంటి నుంచి పరీక్ష కేంద్రానికి చేరుకునే సమయంలో ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటుందని తెలిపారు. ప్రత్యేకించి కొత్త కేంద్రాలు కేటాయించిన విద్యార్థులు ముందస్తుగా మార్గం తెలుసుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షలు జరిగే రోజుల్లో విద్యార్థులు కనీసం అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఇంటర్మీడియెట్ బోర్డు స్పష్టం చేసింది. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు అనుమతి ఉండదని హెచ్చరించింది. పరీక్ష కేంద్రాల్లో క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని, బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గుంటూరు జిల్లాలో ఈ ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల కోసం మొత్తం 87 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 68,941 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు అవసరమైన గుర్తింపు పత్రాలను తీసుకువెళ్లాలని, పరీక్ష నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఇంటర్మీడియెట్ బోర్డు సూచించింది. ఈ సౌలభ్యాలతో విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలని అధికారులు ఆదేశాలు జరిచేశారు

## జియో కొత్త రీఛార్జ్ ప్లాన్: 25 జీబీ డేటా..

ఎప్పటికప్పుడు కొత్త ప్లాన్స్ పరిచయం చేసే రిలయన్స్ జియో.. తాజాగా రూ. 365 ప్లాన్ తీసుకొచ్చింది. ఈ ప్లాన్ వ్యాలిడిటీ ఎంత?, డేటా, ఎస్ఎమ్ఎస్ వంటి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. రూ. 365 ప్లాన్ రీఛార్జ్ చేసుకోవడం ద్వారా.. కస్టమర్లు 25 జీబీ డేటా పొందవచ్చు. రోజుకు 100 ఎస్ఎమ్ఎస్‌లు, అన్‌లిమిటెడ్ కాల్స్ 30 రోజుల వ్యాలిడిటీతో పొందవచ్చు. ఇవి కాకుండా.. యూజర్లు మూడు నెలల పాటు జియో హాట్‌స్టార్ మొబైల్ ఒ టీవీ యాక్సెస్‌ను పొందవచ్చు. జియోఏఐ క్లౌడ్ కింద 50 జీబీ డేటా అందుబాటులో ఉంటుంది. కంపెనీ గూగుల్ జెమిని ప్రో ప్లాన్‌ను కూడా అందిస్తోంది. అంతే కాకుండా.. రూ. 35,100 విలువైన గూగుల్ జెమిని ప్లాన్ వినియోగదారులకు ఉచితంగా

## స్వచ్ఛతే రాష్ట్ర పునర్నిర్మాణం...

-మొదటిపేజీ తరువాయి

జలాలు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడే స్థితికి రాష్ట్రాన్ని నెట్టారని విమర్శించారు.

స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా అమలు చేస్తున్నామని తెలిపారు. 97 శాతం మున్సిపాలిటీల్లో ఇంటింటి చెత్త సేకరణ జరుగుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో మార్చి నాటికి 100 శాతం డోర్ టు డోర్ కలెక్షన్ సాధిస్తామని ప్రకటించారు. చెత్త నుంచి సంపద సృష్టించడమే లక్ష్యంగా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు, కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి విధానాలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు వివరించారు.

రాజకీయంగా ఈ సభకు ప్రాధాన్యం తీసుకొచ్చింది -- తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారం. గత పాలకులు శ్రీవారి ప్రసాద పవిత్రతను దెబ్బతీశారని, ల్యాబ్ నివేదికలే దీనికి నిదర్శనమని సీఎం స్పష్టం చేశారు. తప్పులు చేసినవారే ఇప్పుడు ఇతరులపై నిందలు వేస్తున్నారని, "దొంగే దొంగా దొంగా" అనే పరిస్థితి నెలకొందని తీవ్రస్థాయిలో విమర్శించారు. నిందితులను నడి రోడ్డుపై నిలబెడతామని హెచ్చరించడం రాజకీయంగా తీవ్ర సందేశంగా మారింది.

శాసన మండలిలో వెంకటేశ్వరస్వామి ఫోటోలను చెప్పులతో తీసుకెళ్లి రాజకీయం చేయడాన్ని సీఎం తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం రాజకీయ అంశం కాదు -- కోట్లాది భక్తుల మనోభావాలపై దాడి అని వ్యాఖ్యానించారు. మత పవిత్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

సంక్షేమ పథకాల విషయంలోనూ సీఎం తన రాజకీయ అజెండాను స్పష్టంగా ఉంచారు. సూపర్ సిక్స్, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, పీ4 వంటి కార్యక్రమాలు దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేనంత విస్తృతంగా అమలవుతున్నాయని చెప్పారు. సంక్షేమం అంటే ఓటు రాజకీయాలు కాదు -- జీవన ప్రమాణాలు పెంచే సాధనం అని వ్యాఖ్యానించారు.

టెక్నాలజీపై ఆయన ప్రసంగం మరో కీలక రాజకీయ కోణాన్ని తీసుకొచ్చింది. వాట్సప్ గవర్నెన్స్, ఏఐ ట్యూటర్, వ్యవసాయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గూగుల్ డేటా సెంటర్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అంశాలు రాష్ట్ర భవిష్యత్తుపై తన దూరదృష్టిని చాటాయి. ఢిల్లీలో జరిగిన ఏఐ సదస్సులో కాంగ్రెస్ పార్టీ ప్రవర్తనను ఆయన తీవ్రంగా ఖండించారు.

మొత్తంగా వినుకొండ సభ -- అభివృద్ధి వర్సెస్ విధ్వంస రాజకీయాల మధ్య స్పష్టమైన రేఖ గీసింది. చెత్త రాజకీయాలను తిరస్కరించి, స్వచ్ఛత--సంక్షేమం--టెక్నాలజీతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న సీఎం పిలుపు ప్రజల్లో కొత్త చర్చకు దారితీసింది.


## ఇదే కదా ఆదర్శం...

**నంద్యాల జిల్లా రక్షణ అవషం**

నందికొట్కూరు మండల పరిధిలోని కొణిదెల గ్రామానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో అభివృద్ధి ఊపిరి పోసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొణిదెల గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలులోకి తెచ్చి మాట నిలబెట్టుకున్నారు. గ్రామ తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్వయంగా రూ.50 లక్షల విరాళం అందించి, 90,000 లీటర్ల సామర్థ్యంతో రక్షిత తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి ముందడుగు వేశారు. ఈ ట్యాంకు ద్వారా కొణిదెల గ్రామ పరిధిలో నివసిస్తున్న సుమారు రెండు వేల మంది ప్రజల దాహార్తి తీరనుంది. వేసవికాలానికి ముందే ట్యాంకు నిర్మాణం పూర్తికావడం పట్ల ఉప ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేస్తూ, జిల్లా అధికార యంత్రాంగానికి, గ్రామీణ నీటి సరఫరా (రాస్ ) అధికారులకు అభినందనలు తెలిపారు. కొణిదెల గ్రామ అభివృద్ధి కేవలం ఈ ఒక్క పనితోనే పరిమితం కాలేదు. పల్లెపండగ 1.0 కార్యక్రమం కింద సుమారు రూ.20 లక్షలతో మూడు అంతర్గత రహదారుల నిర్మాణం పూర్తయ్యింది. పల్లెపండగ 2.0లో రూ.45 లక్షల అంచనా వ్యయంతో ఏడు సీసీ రోడ్లను మంజూరు చేయగా, ప్రస్తుతం అవి పురోగతిలో ఉన్నాయి. అదేవిధంగా గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ కింద కొణిదెల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి పగిద్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం వరకు ఐదు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేశారు. ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి కొణిదెల గ్రామం వరకు ఉన్న రహదారి పునరుద్ధరణకు మరో రూ.45 లక్షలు కేటాయించారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల గ్రామానికి రాకపోకలు మరింత సులభం కానున్నాయి. గ్రామస్తుల అభ్యర్థన మేరకు నాలుగు గోకులాలు నిర్మించడంతో పాటు, గృహ నిర్మాణశాఖ సహకారంతో 19 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నీటితొట్టెలు ఏర్పాటు చేసి పశుపోషణకు మరింత దోహదం కల్పించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ ఉపాధి హామీ పథకం కింద 49 ఫీడర్ ఛానల్స్ అభివృద్ధి చేశారు. రెండు మైనర్ కాలువలను పునరుద్ధరించడంతో పాటు, మూడు కమ్యూనిటీ చెక్ డ్యామ్స్ మరమ్మత్తులు పూర్తిచేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో కొణిదెల గ్రామస్తులు తమ గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరినప్పుడు, తన ఇంటి పేరుతో ఉన్న గ్రామమని భావించి దత్తత తీసుకుంటానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. గత ఏడాది నందికొట్కూరు నియోజకవర్గంలో ఫారం పాండ్స్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.50 లక్షల విరాళాన్ని అందించి అభివృద్ధి పనులకు బాట వేశారు. ఇప్పటివరకు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా కొణిదెల గ్రామ అభివృద్ధికి సుమారు రూ.6 కోట్లకు పైగా నిధులు వెచ్చించబడడం విశేషం. గ్రామస్తులు అడిగిన ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులు చేపడుతుండటం వల్ల కొణిదెల గ్రామం ఇప్పుడు జిల్లాలోనే అభివృద్ధికి చిరునామాగా మారుతోంది.

## శుభవార్త చెప్పిన అచ్చన్న...

**అమరావతి, రక్షణ న్యూస్**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ (గ్రిస్ ) కింద మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా సహాయాన్ని విడుదల చేసినట్లు వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం వెల్లడించారు. 2018 సంవత్సరం నుంచి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న 95 కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, మొత్తం రూ.4.75 కోట్లను మంజూరు చేసి విడుదల చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ కేసులను వేగవంతంగా పరిష్కరించి, 95 మంది లబ్ధిదారుల్లో 90 మంది మత్స్యకారుల కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఇప్పటికే ఎక్స్‌గ్రేషియా మొత్తాలను జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. మిగిలిన ఐదుగురు లబ్ధిదారుల బ్యాంకు ఖాతా వివరాల్లో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా జమ ప్రక్రియ పూర్తికాలేదని, ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారి ఖాతాల్లో కూడా ఎక్స్‌గ్రేషియా మొత్తాలను జమ చేయనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సహాయం అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కేసుల్లో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ చర్య ద్వారా అనేక సంవత్సరాలుగా సహాయం కోసం ఎదురుచూస్తున్న మత్స్యకారుల కుటుంబాలకు ఊరట కలిగిందని అధికారులు తెలిపారు.

